

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి

వేములవాడ: రాజన్న అనుబంధ భీమన్న ఆలయంలోని నవగ్రహాల మండపంలో శనిత్రయోదశి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది(సా॥)	సహార్ సోమ(ఉ॥)
కరీంనగర్	6.28	4.35
పెద్దపల్లి	6.35	4.42
రాజన్న సిరిసిల్ల	6.35	4.43
జగిత్యాల	6.35	4.42

గరిష్టం/కనిష్టం
41.0/28.0

వాతావరణం

ఆకాశం ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ వడగాలులు వీచే అవకాశం ఉంది. రాత్రి పొద్దుపోయే వరకు వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ

సిరిసిల్లటౌన్: మెడికోలకు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ పేర్కొన్నారు. సిరిసిల్లలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. పౌరులు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెడికోలు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. న్యాయ విజ్ఞాన సమితి సభ్యుడు చింతోజు భాస్కర్, మెడికల్ కళాశాల హెచ్‌వోడీ డాక్టర్ అన్వర్ హుస్సేనా, న్యాయవాదులు ఆడెపు వేణు, కళ్యాణి, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపిక



కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సిరిసిల్లకల్చరల్: కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో కిక్‌బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్ విభాగాల్లో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన పలువురిని వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అక్కనపల్లి వినోద్, కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. శిక్షకులు ఎనగందుల శ్రీనివాస్, మాస్టర్ దివ్య, మాస్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- జెడ్పీ సీఈవో ఉమారాణి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో ఉమారాణి

బోయినపల్లి(చొప్పదండి): మండలంలో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో ఉమారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్‌లో శనివారం అధికారులతో సమావేశమయ్యారు. సీఈవో ఉమారాణి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో బీమా జయశీల, ఎంపీవో గంగాతిలక్, వాటర్‌గ్రిడ్ అధికారులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనే లక్ష్యం

- డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు



లెప్రసీ నోడల్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తున్న డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: కుష్ఠు నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వైద్యసిబ్బంది కృషి చేస్తుందని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. జిల్లా కార్యాలయంలో శనివారం లెప్రసీ నోడల్ సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రి ఆపరేటర్లకు ఇచ్చిన శిక్షణలో మాట్లాడారు. కుష్ఠువ్యాధి లక్షణాలు, చికిత్సపై పీహెచ్‌సీల్లోని లెప్రసీ సిబ్బందికి వివరించారు. కొత్తగా గుర్తించిన కేసులను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయాలో వివరించారు. లెప్రసీ ఇండియా ప్రతినిధులు కామేశ్వర్‌రావు, నరసింహస్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రజిత, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ నయీంజహా పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు రైతులను మోసం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఎండిపోయిన రైతుల వరి పంటలను నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయక మో సం చేయగా, బీఆర్‌ఎస్ పదేళ్లు అధికారంలో ఉండి రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయలేదని ఆ రోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓట్లడిగే హక్కు లేదన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు క్యాతం తిరుపతిరెడ్డి, బోగోజి గంగాధర్ చారి, కొనుకటి హరీశ్, అమిరిశెట్టి గంగయ్య, అనిల్, తదితరులున్నారు.

బతుకుదెరువు చూపాలి

- బతుకమ్మ ఆర్డర్లు ఇవ్వాలి
- బకాయిలు విడుదల చేయాలి
- ప్రభుత్వం భరోసా ఇస్తేనే బతుకుదెరువు
- సిరిసిల్ల 'నేతన్నల గర్జన' సభలో వక్తలు



మాట్లాడుతున్న నాయకులు



నేతన్నల గర్జన సభకు హాజరైన నేతన్నలు

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి ఖిల్లా.. సిరిసిల్ల నేతన్నలకు బతుకుదెరువు చూపాలని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని నేతన్నల జేఏసీ నాయకులు కోరారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి నిర్వహించిన 'నేతన్నల గర్జన' సభలో పలువురు వక్తలు మాట్లాడారు. పాతిక వేల మంది కార్మికులు ఆధారపడి ఉన్న సిరిసిల్ల వస్త్రపరిశ్రమను నిర్లక్ష్యం చేయొద్దని కోరారు. ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేతన్నల ఉపాధి, బతుకుదెరువు సమస్యను రాజకీయ కోణంలో ఆలోచించకుండా.. మానవీయ కోణంలో చూడాలన్నారు. సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పాలకులు చొరవ చూపాలన్నారు. వస్త్ర పరిశ్రమకు గతంలో లాగే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలని, గత ప్రభుత్వ హయాంలో సేకరించిన బట్టకు సంబంధించిన బకాయిలు విడుదల చేయాలని, కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు విడుదల చేయాలని కోరారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షేమానికి యారన్ డిపోలను ఏర్పాటు చేయాలని, గతంలో లాగే కుటీర పరిశ్రమగా గుర్తించి విద్యుత్ 50 శాతం సబ్సిడీని కొనసాగించాలని కోరారు. సిరిసిల్ల నేతన్నల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికులకు భరోసా కల్పించాలన్నారు. నేతన్నల గర్జన వేదికలో కార్మిక నాయకులు, ఆసాముల ప్రతినిధులు, వస్త్రోత్పత్తిదారులు మాట్లాడారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్, సిరిసిల్ల జేఏసీ నాయకులు మూషం రమేశ్, పంతం రవి, మండల సత్యం, సిరిసిల్ల రవీందర్, మంచె శ్రీనివాస్, తాటిపాముల దామోదర్, యెల్దండి దేవదాస్, గెంట్యాల శ్రీనివాస్, యెల్దండి శంకర్, వెంగళ శ్రీనివాస్, వేముల దామోదర్, శంకర్, రవి, వస్త్రోత్పత్తిదారులు, ఆసాములు, కార్మికులు పాల్గొన్నారు.



చేనేతపై అపు'రూపాలు'

సిరిసిల్ల: కుంచెతో పేపర్‌పై చిత్రాలు వేయడం ఓ కళ.. వృత్తిలోనే నూతనత్వం తీసుకొచ్చేందుకు చేనేత మగ్గాన్నే కాన్వాస్‌గా చేసుకోవడం మరో కళ. ఈ చేనేత కళారంగంలో సిరిసిల్లకు చెందిన కూరపాటి శ్రీనివాస్ తన ప్రతిభతో అద్భుత చిత్రాలు వేస్తున్నారు. జీవకళ ఉట్టిపడేలా దారంపోగులతో చిత్రాలు వేస్తూ అబ్బురపరుస్తున్నారు. గత ముప్పై ఏళ్లుగా తన కళతో పలువురి ప్రముఖుల చిత్రాలను వేస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. చేనేతకళాకారుడు కూరపాటి శ్రీనివాస్‌పై ఈవారం ప్రత్యేక కథనం. - 8లో▸

హామీలపై బరాబర్ నిలదీస్తాం

- రైతన్నలు, నేతన్నల పక్షాన నిలుస్తాం
- రైతుదీక్షలో ఎమ్మెల్యే కేటీఆర్



రైతుదీక్షలో అభివాదం చేస్తున్న కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులు ఆగయ్య, అరుణ, రవీందర్‌రావు, ప్రవీణ్

సిరిసిల్లటౌన్: ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి గద్దెనెక్కి రైతులు, నేతన్నలకు కాంగ్రెస్ చేస్తున్న అన్యాయంపై పోరాడుతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.తారకరామారావు పేర్కొన్నారు. ఇచ్చిన హామీల అమలుపై బరాబర్ నిలదీస్తామన్నారు. సిరిసిల్లలోని తెలంగాణభవన్‌లో శనివారం చేపట్టిన రైతుదీక్షలో పాల్గొని మాట్లాడారు. వందరోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం అన్న కాంగ్రెసోల్లు తొర్రీలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణకు జల వరప్రదాయిని మిడ్‌మానేరు ఎండిపోవడం, ఈప్రాంతంలో రైతులు పంట నష్టపోవడం ఇదంతా కాంగ్రెస్ సర్కారు పాపమేనని విమర్శించారు. మేడిగడ్డలో కేవలం రెండు పిల్లర్లు కుంగితే గోరంతను కొండంత చేసి కేసీఆర్‌ను బదనాం చేసే రాజకీయం చేస్తున్నారన్నారు. రైతులకు నీరిచ్చే పనులు చేయడం లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ కూడా నల్లచట్టాలతో రైతుల హక్కులను హరించారని విమర్శించారు. అదానీలు, అంబానీల వంటి కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ.. వేలాది కోట్ల రూపాయలు అప్పనంగా మాఫీ చేశారనన్నారు. రైతులకు ఏమాత్రం సాయం చేయడం లేదన్నారు. నేతన్నల ఆత్మహత్యలు, వస్త్రపరిశ్రమ సంక్షోభానికి కారణమైన సర్కారుపై పోరాటానికి పార్టీ శ్రేణులు సిద్ధమని పేర్కొన్నారు.

ఆటపాటలతో ఉత్సాహం

రైతుదీక్షలో కళాకారులు మాట్ల తిరుపతి, దరువు ఎల్లన్న, శ్రీకాంత్ తదితరులు ఆటపాటలతో హోరెత్తించారు. గంటల తరబడిగా జరిగిన దీక్షలో స్థానిక నాయకులు ప్రసంగిస్తూ..కేటీఆర్ దిశానిర్దేశంతో రైతులు, నేతన్నలు, పేదప్రజల సంక్షేమానికి పోరాడుతామన్నారు. రాములు అనే రైతు ప్రసంగంతో సభికులను ఆకట్టుకున్నాడు. తెలంగాణ వచ్చినంకనే పదేళ్లుగా పంటలు పండి అన్నం తింటున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దంటూ మాట్లాడాడు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మంచె శ్రీనివాస్, ఎండి సత్తార్, అగ్గి రాములు, సరస్వతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు

- కాంగ్రెస్ కరువు తెచ్చిందనడం హాస్యాస్పదం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కేసీఆర్ వ్యాఖ్యలపై మండిపాటు



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: రైతులు, నేతన్నలను పీకల్లోతు నష్టాల్లోకి నెట్టి ఇప్పుడు మాజీ సీఎం కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రైతులు, నేతన్నలను విడదీయడం మీతరం కాదని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని రూ.6.71లక్షల కోట్ల అప్పుల్లోని నెట్టారన్నారు. కాంగ్రెస్ తెచ్చిన కరువు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఖమ్మంలో రైతుల చేతులకు బేడీలు వేయించిన చరిత్ర మరిచిపోలేదన్నారు. మా ప్రభుత్వం హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు యాభై ఏళ్లకు పైగా ఉంటున్నాయని.. నీవు కట్టించిన ప్రాజెక్టులు మూడున్నరేళ్లకే ఎందుకు కూలిపోతున్నాయి అని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయాంలోనే సిరిసిల్ల నేతన్నలకు రూ.272కోట్లు బకాయి పడ్డారని, ఎందుకు ఇవ్వలేదని అడిగారు. నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం తరఫున త్వరలోనే పథకాలు అమలు చేస్తామని తెలిపారు.

అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకోం..

– సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

అధికారం కోల్పోయిన కేసీఆర్ కాంగ్రెస్ నేతలపై అడ్డగోలుగా మాట్లాడితే సహించబోమని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్నాళ్లు సీఎం పదవిలో కొనసాగిన వ్యక్తి దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. ఎన్నికలకు ముందు బతుకమ్మ చీరల బకాయిలకు టోకెన్లు ఇచ్చి నిధులు కేటాయించకుండా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కారకులయ్యారని విమర్శించారు. గతంలో సిరిసిల్ల వస్త్రపరిశ్రమను వైఎస్సార్ హయాంలో ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, గడ్డం నర్సయ్య, గుండ్లపెల్లి రామానుజం, యెల్లె లక్ష్మీనారాయణ, కాముని వనిత, వెల్ముల స్వరూప, కల్లూరి చందన, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు

- ఈవో చాంబర్‌లో సమీక్ష సమావేశం
- ఆర్డీవో రాజేశ్వర్ అధ్యక్షతన సమావేశం



సమావేశమైన ఆర్డీవో రాజేశ్వర్, ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో ఈనెల 9 నుంచి 17 వరకు అత్యంత వైభవంగా శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆర్డీవో రాజేశ్వర్ ప్రకటించారు. చైర్మన్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో శనివారం సమావేశమయ్యారు. రాములోరి కల్యాణానికి రెండు లక్షల మంది వరకు భక్తులు హాజరయ్యే అవకాశాలు ఉండడంతో ఆమేరకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా షామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా వైద్య శిబిరాలు, అంబులెన్స్, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వేములవాడ మునిసిపాలిటీ, ఆలయ పారిశుధ్య విభాగం సంయుక్తంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా చూసుకోవాలన్నారు. ప్రత్యేక బస్సులు నడిపించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెస్ అధికారులు చొరవ చూపాలన్నారు. బద్ది పోచమ్మ ఆలయం, జాతర ఏరియాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో మద్యం విక్రయాలపై నిషేధం విధించాలని ఎక్సైజ్‌శాఖను ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా పారిశుధ్య పనులకు అదనపు కార్మికులను నియమించుకోవాలని సూచించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ నాగేంద్రచారి, మున్సిపల్ మేనేజర్ సంపత్‌రెడ్డి, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈవోలు శ్రీనివాస్, హరికిషన్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు శ్రీరాములు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రతల గురించి శనివారం మీడియాతో వివరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెస్సేజ్‌లను ఓపెన్ చేయొద్దని, ఫోన్‌లలో ఇతరులకు ఓటీపీలను చెప్పొద్దని సూచించారు. ఆన్‌లైన్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని కోరారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930, డయల్ 100కు కాల్ చేయాలని కోరారు. ఇటీవల సిరిసిల్లకు చెందిన యువకుడు ఇన్‌స్టాగామ్‌లో ఐపీఎల్ టికెట్స్ కోసం రూ.32వేలు పంపి మోసపోయారని తెలిపారు. ఇలాంటి వాటిని నమ్మి మోసపోవద్దని ఎస్పీ కోరారు.

బీజేపీతోనే సురక్షిత పాలన

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పార్లమెంట్ కో–కన్వీనర్ రవీందర్
- ఘనంగా బీజేజీ ఆవిర్భావ వేడుకలు



వేములవాడలోని జెండా ఎగురవేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

వేములవాడ/సిరిసిల్లటౌన్: దేశ ప్రజలు కోరుకున్నట్లుగా సురక్షిత పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడెపు రవీందర్ పేర్కొన్నారు. వేములవాడ, సిరిసిల్లల్లోని పార్టీ కార్యాలయాల్లో శనివారం బీజేపీ జెండాలు ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వాజ్‌పేయ్‌లు చూపిన మార్గంలో మోదీ, అమిత్‌షా వెళ్తున్నారన్నారు. భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు వారు చేస్తున్న కృషికి ప్రజల మద్దతు కావాలని కోరారు. ప్రధాని నరేంద్రమోదీ రెండు పర్యాయాలు పాలనచేసి దేశాన్ని అభివృద్ధిలో ముందుంచారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపిద్దామని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు రేగుల మల్లికార్జున్, రేగుల సంతోష్, కోల కృష్ణస్వామి, పిన్నింటి హన్మండ్లు, చందనం సత్యనారాయణ, మనోజ్, రాహుల్, నర్సయ్య, నాగుల శ్రీనివాస్, మాధవి, గాజుల సదా, గాజుల వేణు, కోడం ఆనంద్‌బాబు, ఊరగొండ రాజు, మోర శ్రీహరి, ప్రకాస్, సత్యం, అంబదాస్, బాలకిషన్ పాల్గొన్నారు.

సాగు వినూత్నం.. కరువు పరార్

- నీటిని ఒడిసిపట్టి.. పంటలకు ప్రాణం పోసి
- కరువును జయించిన కర్షకులు
- సంప్రదాయానికి భిన్నంగా వ్యవసాయం
- కరువు సీమలో సిరుల సేద్యం
- సొంతంగా మార్కెటింగ్ చేస్తున్న రైతులు
- ఆర్థికంగా నిలదొక్కుకుని ఇతరులకు ఆదర్శం



పెద్దబోనాలలో పాలకూరతోటలో దొంతుల బాలరాజు

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా మెట్ట ప్రాంతం. ఆయకట్టేతర ప్రాంతం. ఇక్కడ సాగునీటికి ఎప్పుడూ తిప్పలే. కరువు పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎటూ చూసిన పంటలు ఎండిపోయి.. బోర్లు ఎత్తిపోయి, చెరువులు అడుగంటి కనిపిస్తున్నాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో కొందరు రైతులు పసిడి పంటలు పండిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి నీటివసతిని సద్వినియోగం చేసుకుంటూ.. వ్యవసాయంలో ప్రయోగాలు చేస్తున్నారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తూ కరువును జయిస్తున్నారు. సంప్రదాయ పంటలకు భిన్నంగా సేద్యం సాగిస్తున్న కర్షకుల ఆదర్శంపై కథనం.

బోరుబావితో మూడు పంటలు

బోయినపల్లి మండలం దేశాయిపల్లికి చెందిన మాడిశెట్టి జనార్దన్ మూడు పంటలు పండిస్తున్నారు. బోరుబావి ద్వారా వచ్చే నీటికి డ్రిప్పు సాయంతో పంటలకు అందిస్తున్నారు. ప్రస్తుతం 20 గుంటల్లో బీర, మరో 20 గుంటల్లో టమాట, ఇంకో 20 గుంటల్లో పూటపండును సాగుచేశారు. నీరు వృథా కాకుండా డ్రిప్పు ద్వారా అందిస్తున్నారు. పంట దిగుబడి మంచిగా రావడంతో పెట్టుబడి పోను లాభాలు ఆర్జిస్తున్నారు. జనార్దన్ తన పంటను కరీంనగర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.

పది గుంటల్లో నెలకు రూ.10వేలు

కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన కాసర్ల ఏదిరెడ్డి పది గుంటల్లో దొండతోట సాగుచేశారు. దొండకాయలు తెంపి, మార్కెట్‌కు తరలిస్తూ నెలకు రూ.10వేలకు తగ్గకుండా ఆదాయం పొందుతున్నారు. దొండతోటను ఒక్కసారి పెడితే పలు మార్లు పంట వస్తుంది. పందిరి వేసి.. నీరు కడుతూ.. వేసవిలోనూ ఏదిరెడ్డి ఆదాయం పొందుతున్నారు. వరి పంటకు నీరు ఎక్కువ అవసరం ఉంటుంది. దాని కంటే.. ఇది ఎంతో మేలని ఏదిరెడ్డి చెబుతున్నారు.

సన్నరకాల సేద్యం

తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన ఆదర్శ రైతు పబ్బతి విజయేందర్‌రెడ్డి యాసంగి సీజన్‌లో సన్నరకాలు జైశ్రీరాం, కేఎస్ఎం–1638 రకాల వరిని సేద్యం చేశారు. తనకున్న పదిన్నర ఎకరాల్లో సన్నరకాలను సాగుచేసి పొలం ఎండిపోకుండా నీటి యాజమాన్య పద్ధతులు పాటించారు. మరో వారం రోజుల్లో పంటకోతకు వస్తుంది. ఎకరానికి 30 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని విజయేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎకరానికి 35 క్వింటాళ్ల దిగుబడి సాధించిన సందర్భాలు ఉన్నాయి. సన్నరకాలను సాగుచేసి మంచి దిగుబడి సాధించడం విశేషం.

ఎకరంలో నాలుగు పంటలు

వేములవాడ అర్బన్ మండలం శాలరామన్నపల్లెకు చెందిన రైతు కొలుగూరి తిరుపతి ఎకరం భూమిలో నాలుగు పంటలు వేశారు. టమాట, బెండకాయ, వంకాయ, కొత్తిమీర పంటలను వేశారు. బోరు ద్వారా వచ్చే కొద్దిపాటి నీటితో కూరగాయలు పండిస్తున్నారు. భూగర్భ జలాలు అంతగా లేకున్నా.. కొద్దిపాటి నీటితో పంటలను సాగుచేశారు. నాలుగు రకాల పంటలు వేయడంతో మార్కెట్‌లో ఆయా పంటల డిమాండ్‌ను బట్టి ఆదాయం లభిస్తుంది. ఒక్క పంటకు నష్టం కలిగినా మరో పంటలో ఆదాయం వస్తుందని తిరుపతి ఆశిస్తున్నారు.

మూడు ఎకరాల్లో 14 పంటలు

సిరిసిల్ల శివారులోని పెద్దబోనాలకు చెందిన దొంతుల బాలరాజు మూడు ఎకరాల్లో 14 పంటలను సాగుచేశారు. బోరు వేయకుండా వ్యవసాయ బావి ద్వారా వచ్చే నీటితోనే ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. అందరి కంటే భిన్నంగా పుదీన, కరివేపాకును సాగుచేశాడు. కొద్ది పాటి నీటి ఆధారంగా విభిన్నమైన పంటలు సాగు చేస్తున్నారు. సిరిసిల్ల మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండించడం ఆయన ప్రత్యేకత. ఏడాది పొడవునా బాలరాజు వ్యవసాయ క్షేత్రంలో కూరగాయలు, ఆకుకూరలు ఉంటాయి.



కనగర్తిలో దొండతోటలో ఏదిరెడ్డి



జిల్లెల్లలో సన్నాలు వేసిన పబ్బతి విజయేందర్‌రెడ్డి



మాడిశెట్టి జనార్దన్



కొలుగూరి తిరుపతి

క్లుప్తంగా

11 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న సీఎస్ అధికారులు

రామగుండం: అంతర్గాం మండలం టీటీఎస్ అంతర్గాంలో శనివారం సివిల్ సప్లయ్ అధికారులు సోదాలు చేశార. పెద్దపల్లి సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ పెంచాల మల్లికార్జున్‌రావు, మంథని సివిల్ సప్లయ్ ఇన్‌స్పెక్టర్ ఐత శ్రీనివాస్ సంయుక్తంగా జరిపిన ఈ సోదాల్లో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలు గుర్తించారు. ఈమేరకు బాధ్యుడైన బూజ్జ స్వామినాథన్ నుంచి బియ్యం స్వాధీనం చేసుకొని 6ఏ కేసు నమోదు చేశారు. బియ్యం నిల్వలను పెద్దపల్లికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

వాగులో పడి వలసకూలీ మృతి

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం చౌలమద్ది పెద్దవాగులో పడి వలసకూలీ మృతిచెందాడు. ఎస్సై చిరంజీవి వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా భీమారం మండలం బురుగుపల్లి గ్రామానికి చెందిన మామిడి పోచయ్య(49) చౌలమద్ది పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులకు వచ్చాడు. శుక్రవారం వాగువద్దకు స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. శనివారం మృతదేహాన్ని వాగు నుంచి బయటికి తీసి మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పసి బాలుడిని చిదిమేసిన ఆటో



కోరుట్ల: ఇంట్లో అమ్మ బట్టలు ఉతుకుతుంటే.. నీళ్లు పడతానంటూ అప్పటివరకు ఆడుకున్న ఆ 16 నెలల పసిబిడ్డ రోడ్డుపైకి వెళ్లి ఆటో కింద పడి మృతిచెందడం కోరుట్లలోని అంబేద్కర్‌నగర్‌లో విషాదం నింపింది. అంబేద్కర్‌నగర్‌లో నివాసముండే పొట్ట రిషీందర్, అపూర్వ దంపతులకు కుమారుడు సుధన్వా (16నెలలు) ఉన్నాడు. శనివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో అపూర్వ ఇంట్లో బట్టలు ఉతుకుండగా..ఆమెతోపాటు నీటిలో ఆడుకున్న సధన్వా చుట్టుపక్కల పిల్లలు కనిపించేసరికి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే సమయంలో వాటర్ క్యాన్లు సరఫరా చేసే ఆటో రోడ్డుపైకి వచ్చింది. వాటర్ క్యాన్లు అక్కడే ఉన్న ఓ ఇంట్లో వేసి ఆటోను రివర్స్ చేస్తున్న క్రమంలో సుధన్వా వెనక టైర్ల కింద పడటంతో అక్కడిక్కడే మృతిచెందాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కిరణ్ తెలిపారు.

చేనేతపై అపు'రూపాలు'

- సిరిసిల్ల నేతకార్మికుడి కళాసృష్టి
- దారం పోగులతో అద్భుత చిత్రాలు
- మగ్గంపైనే అనేక రూపాలు
- ఆకట్టుకుంటున్న కూరపాటి శ్రీనివాస్ ఆవిష్కరణలు

సండే స్పెషల్



వైఎస్సార్‌కు ఆయన చిత్రపటాన్ని అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు (ఫైల్)






వై.ఎస్.విజయమ్మ, చాగంటి కోటేశ్వర్‌రావు తదితరుల చిత్రాలు

సిరిసిల్ల: అగ్గిపెట్టెలో ఇమిడే చీరలు నేసి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన సిరిసిల్ల చేనేత కారులు మగ్గంపై అద్భుతచిత్రాలను నేస్తూ అబ్బురపరుస్తున్నారు. కుంచెతో రంగులద్దుతూ చిత్రాలు వేయడం సహజం. మగ్గంపైనే దారం పోగులతో జీవం ఉట్టిపడేలా చిత్రాలను ఆవిష్కరిస్తున్నారు సిరిసిల్లకు చెందిన నేతకళాకారుడు కూరపాటి శ్రీనివాస్(64). మగ్గంపై శ్రీనివాస్ నేసిన చిత్రాలు అంతర్జాతీయంగా గుర్తింపు సాధించాయి. వందలాది చిత్రాలకు ప్రాణం పోస్తున్న కళాకారుడు కూరపాటి శ్రీనివాస్ చిత్రరాజసాలపై ప్రత్యేక కథనం..

వలస కథ.. ఆయన వ్యథ

సిరిసిల్లకు చెందిన శ్రీనివాస్ కులవృత్తి చేనేతను నమ్ముకొని జీవిస్తున్నారు. ఆ వృత్తిలో డిజైన్ మాస్టర్‌గా ఉంటూ.. మగ్గంపై అద్భుత చిత్రాలకు ప్రాణం పోస్తున్నారు. పొట్టచేత పట్టుకొని అందరి కార్మికుల్లాగే సిరిసిల్ల నుంచి మహారాష్ట్రలోని భీవండికి ముప్పై ఏళ్ల కిందటే వలస వెళ్లాడు. అక్కడే డిజైన్ మాస్టర్‌గా మగ్గంపై చేనేత కళారూపాలను ఆవిష్కరించాడు. ఈక్రమంలోనే షోలాపూర్ వెళ్లి పాతికేళ్లుగా అనేక మంది ప్రముఖుల చిత్రాలను మగ్గంపై నేసి గుర్తింపు సాధించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు జగన్‌మోహన్ రెడ్డి, రాజారెడ్డి, విజయమ్మ చిత్రపటాలతోపాటు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, సోనియాగాంధీ, జార్జిబుష్, బిల్‌క్లింటన్, జేఆర్డీ టాటా, షీలాదీక్షిత్, వాజ్‌పేయి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, నిజామాబాద్ మాజీ ఎంపీ కవిత, సంగీత దర్శకుడు ఘంటశాల వంటి వారి వందలాది చిత్రాలను వేశారు. హైదరాబాద్ అసెంబ్లీ ముందు ఉన్న మహాత్ముడి చిత్రపటాన్ని అచ్చం జీవకళ ఉట్టిపడేలా మగ్గంపై నేశారు. ఒక్కో చిత్రపటం తయారీకి పక్షం రోజుల వరకు మగ్గంపై శ్రమిస్తారు. ఒక్క పోగు మారిపోయినా ముఖ కవళికలు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి అరుదైన రంగంలో జీవకళ ఉండే చిత్రాలను నేస్తున్నారు శ్రీనివాస్. ఆయన సృష్టించిన చిత్రాలు ఒక్కొక్కటి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఉంటాయి. ఆర్థికంగా ఆటుపోట్లను ఎదుర్కొంటున్న శ్రీనివాస్ ఈ రంగాన్ని నమ్ముకొని ముందుకుసాగుతున్నారు.

లండన్‌లోనూ మన చిత్రం

లండన్‌లోని చర్చిలో శ్రీనివాస్ చిత్రపటానికి చోటు దక్కింది. గోవాలోని ఓ మిత్రుడి ద్వారా లండన్ చర్చి ఫాదర్ జాన్సన్ ప్రత్యేక ఆసక్తితో క్రీస్తుతో సహా పదమూడు మంది చిత్రాలతో మగ్గంపై నేసిన చివరివిందు చిత్రాన్ని నేయించారు. తొంభై అంగుళాల పొడవు, యాభై అంగుళాల వెడల్పుతో ఈ కళాఖండాన్ని శ్రీనివాస్ రూపొందించారు. ఈ చిత్రం లండన్ చర్చిలో ప్రదర్శనకు ఉంచారు. సామాజికాంశాలపైన శ్రీనివాస్ చిత్రాలు వేస్తున్నారు. ఇంట్లో పెద్దలు చనిపోయినప్పుడు వారి జ్ఞాపకార్థం చేనేత మగ్గంపై శ్రీనివాస్‌తో చిత్రాలు నేయించుకుంటున్నారు. సిరిసిల్లతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. రిలయన్స్ అధినేత ధీరూభాయ్ అంబాని చిత్రాన్ని ఆయన తనయుడు ముఖేశ్ అంబానికి అందించారు.

కొత్త తరం రావడం లేదు



చేనేత మగ్గంపై అనేక చిత్రాలను నేశాను. చేనేత కళ అంతరించి పోతుంది. ఈ రంగంలోకి కొత్తతరం రావడం లేదు. సిరిసిల్ల చేనేత వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు మగ్గంపై చిత్రాలు నేసే కళను శిక్షణ ఇవ్వాలని ఉంది. ఇందు కోసం సిరిసిల్లలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. ప్రభుత్వపరంగా సహకారం లభిస్తే ఔత్సాహిక యువకులకు శిక్షణ ఇస్తాను. ఇప్పటి వరకు నేను నేసిన చిత్రాలతో ఓ ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఉంది. – కూరపాటి శ్రీనివాస్, చిత్రకారుడు

ఎవరి కోసం బతకాలె బిడ్డా..

- మొరం టిప్పర్ బోల్తాపడి అన్నాచెల్లెలు, పెద్దనాన్న కూతురు మృతి
- ఆనందంగా గడిపి.. అంతలోనే మృత్యుఒడికి
- మృతులు ఒకే కుటుంబానికి చెందినవారు
- మిన్నంటిన రోదనలు.. రెండు గ్రామాల్లో విషాదం



రోదిస్తున్న విజయ్, వర్ష తల్లి రేణుక, బంధువులు


విజయ్ (ఫైల్)


వర్ష (ఫైల్)


సింధూజ (ఫైల్)

హుజూరాబాద్: 'అవ్వ మేము బాగా చదువుకుంటాం. మీకు కష్టాలు రాకుండా చూసుకుంటాం. మా కోసం మీరు ఎంతో కష్టపడుతున్నారు. కూలీ పనులు చేసి చదివిస్తున్నారు. మంచి ఉద్యోగాలు సాధించి కంటికి రెప్పలా చూసుకుంటాం'.. అని విజయ్, వర్ష చెప్పిన మాటలు తలుచుకుంటూ తల్లి రేణుక, తండ్రి వీరస్వామి విలపించిన తీరు కంటతడిపెట్టించాయి. 'ఇంకెవరి కోసం బతకాలె బిడ్డా' అంటూ గుండెలవిసేలా రోదించారు. వీరస్వామి రైస్ మిల్లు హమాలీ కార్మికునిగా, రేణుక కూలీ పనులు చేస్తూ బిడ్డ, కొడుకును చదివిస్తున్నారు. కాగా సింధూజ వీరస్వామి అన్న కూతురు. చేతికి అందివచ్చిన కన్న బిడ్డలు బోనాల పండుగ రోజు ఒకేసారి మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఆనందం.. అంతలోనే విషాదం

బోనాల పండుగ కావడంతో అన్నాచెల్లెలు, వారి అక్క కుటుంబ సభ్యులు, బంధువులతో సందడి చేశారు. కులదేవత పండుగ సందర్భంగా పెద్దలు చేసే ఆచార వ్యవహారాలను అర్ధరాత్రి వరకు తిలకించారు. కొద్ది నిమిషాలైతే ఇల్లు చేరుకునే వారు. కానీ మృత్యువు టిప్పర్ రూపంలో వచ్చి ముగ్గురి ప్రాణాలను బలిగొంది. అప్పటివరకు ఆనందంగా ఉన్న వారి కుటుంబంలో ఒక్కసారిగా విషాదం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధి బోర్నపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి బోనాల జాతర జరుగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన గంట విజయ్(17), వర్ష(15), సింధూజ(18) జాతర నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా సైదాపూర్ మండలం గొడిశాల నుంచి హుజూరాబాద్ వస్తున్న మట్టి టిప్పర్‌ను చూసి భయంతో మూలమలుపు వద్ద ఆగారు. టిప్పర్ వేగంగా వచ్చి వారు ఆగిన చోట ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో టిప్పర్‌లో ఉన్న మట్టి వర్ష, విజయ్, సింధూజపై పడింది. గమనించిన గ్రామస్తులు వెంటనే మట్టిని తొలగించి వర్షను బయటకు తీసి 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మట్టిలో కూరుకుపోయిన విజయ్, సింధూజను జేసీబీ సాయంతో బయటకు తీయగా అప్పటికే మృతిచెందారు.

మృతులు సొంత అన్నదమ్ముల పిల్లలు

బోర్నపల్లికి చెందిన గంట రేణుక– వీరస్వామి దంపతులకు విజయ్, వర్ష సంతానం. విజయ్ ఇంటర్ మొదటి సంవత్సరం, వర్ష పదో తరగతి చదువుతున్నారు. అలాగే సింధూజ వీరస్వామి అన్న గంట శ్రీకాంత్ కూతురు. ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. కాగా శ్రీకాంత్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సింధూజ అమ్మమ్మ గ్రామం హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మాణిక్యపూర్‌లో తల్లితో కలిసి ఉంటోంది. బోనాల పండుగకు రావాలని సింధూజకు తాత ఫోన్ చేసి చెప్పడంతో ఇక్కడికి వచ్చింది. ఆమెకు తమ్ముడు హర్షిత్, తల్లి ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



గంగాధర్(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం మియ్యాపూర్ గ్రామానికి చెందిన దొడ్ల గంగాధర్(30) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. దొడ్ల రాజయ్య–లక్ష్మి దంపతులకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు గంగాధర్ అదే గ్రామానికి చెందిన పెద్దపల్లి రాజేశం వద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రాజయ్యకు చెందిన పొలం వద్ద ఇంటి నిర్మాణం చేపట్టారు. అక్కడికి శనివారం ఇటుకల లోడ్‌తో వ్యాన్ వచ్చింది. వ్యాన్‌ను రివర్స్ తీస్తుండగా డ్రైవర్‌కు గంగాధర్ సూచనలు ఇస్తున్న క్రమంలో వాహనానికి పైన ఉన్న 11కేవీ వైర్లు తగిలి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఘటన స్థలాన్ని సీఐ సుబ్బారెడ్డి సందర్శించారు.

శివపల్లిలో బాలింత..



కీర్తి మృతదేహం

ఎలిగేడు(పెద్దపల్లి): బాత్రూమ్‌లోకి వెళ్లిన బాలింత విద్యుదాఘాతంతో దుర్మరణం చెందింది. ఈ ఘటన తన తల్లిగారు ఇల్లు ఎలిగేడు మండలం శివపల్లిలో జరిగింది. జూలపల్లి ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. శివపల్లి గ్రామానికి చెందిన ఊట్ల పరమేశ్వరి–వెంకటేశం దంపతుల చిన్న కుమార్తె గద్దె కీర్తి(31)కి రామగుండంకు చెందిన స్వాగత్‌తో 2021లో వివాహమైంది. వృత్తిరీత్యా కీర్తి, ఆమె భర్త హైదరాబాద్‌లో ఉంటున్నారు. కీర్తికి 15రోజుల క్రితం పాప పుట్టగా, పుట్టినిల్లు శివపల్లికి వచ్చింది. శుక్రవారం రాత్రి కీర్తి ఇంటి పక్కనే ఉన్న బాత్రూమ్‌లోకి వెళ్లింది. కాసేపటికే పెద్ద శబ్దం రావడంతో తల్లిదండ్రులు వెంటనే అటుగా వెళ్తున్న నాంపల్లి ప్రశాంత్ సాయంతో బాత్రూమ్ తలుపు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా కీర్తికి కరెంట్‌షాక్ తగిలి కిందపడి ఉంది. తలకు బలమైన గాయమై రక్తం కారుతుండడంతో వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలికి 15రోజుల పాప ఉంది. పాపను చూసి గ్రామస్తులు, బంధువులు కంటతడి పెట్టారు.

ఓసీపీ–3లో బ్లాస్టింగ్.. ఆపరేటర్‌కు తీవ్రగాయాలు



కార్మికుడిని పరామర్శిస్తున్న రాజరత్నం

గోదావరిఖని: ఓసీపీ–3 ఫేజ్–1లో శేషుకుమార్ అనే ఆపరేటర్ గాయాలపాలయ్యాడు. శుక్రవారం రాత్రి షిఫ్టులో షావల్ ద్వారా పెద్దబండ(బోల్డర్)ను డంపర్‌లో వేయడంతో డంపర్ క్యాబిన్ ప్రాంతం భారీ కుదుపునకు లోనైంది. డంపర్‌లో ఉన్న ఆపరేటర్ శేషుకుమార్ గాయపడ్డాడు. అతడిని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తీసుకెళ్లాలని వైద్యులు రెఫర్ చేశారు. బ్లాస్టింగ్ సరిగా నిర్వహించకపోవడంతోనే ఈపరిస్థితి ఏర్పడిందని కార్మికులు ఆరోపిస్తున్నారు. మరో రెండు డంపర్లలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఈవిషయంలో సరైన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

తరచూ ప్రమాదాలు..

రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3లో బ్లాసింగ్ సరిగా నిర్వహించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఉత్పత్తి, ఉత్పాదకత కోసం ఉరుకులు పరుగులు పెట్టిస్తున్న అధికారులు.. బ్లాస్టింగ్ నిర్వహణలో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని, ఫలితంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు అంటున్నారు.

కార్మికుడికి అస్వస్థత


సింగరేణి రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 ఫేజ్–2లో జనరల్ మజ్దూర్ కార్మికుడు యు.రవి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పనిస్థలంలో పడిపోయిన రవిని.. తొలుత డిస్పెన్సరీకి తరలించి చికిత్స చేయించారు. అనంతరం ఉన్నత వైద్యం కోసం సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కార్మికుడిని ఏఐటీయూసీ నాయకుడు రాజరత్నం పరామర్శించారు.

అధికారుల నిర్లక్ష్యమే..

అధికారుల నిర్లక్ష్యంతోనే ఓబీలో బోల్డర్‌లు వస్తున్నాయి. గతంలో అనేకసార్లు వారికి చెప్పినా.. పట్టించుకోవడం లేదు. డంపర్లు పాడై సుమారు రూ.20లక్షల వరకు నష్టం వాటిల్లింది. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. – కొత్త సత్యనారాయణరెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు

'చితికి'పోయిన నేతబతుకు

- వెంటాడిన అనారోగ్యం.. ఆర్థిక ఇబ్బందులు
- సిరిసిల్లలో నేతకార్మికుడి బలవన్మరణం
- చలించిన నేతలు.. వెల్లువెత్తిన ఆర్థిక సాయం



లక్ష్మీనారాయణ(ఫైల్)

సిరిసిల్ల: బతుకంతా ఎదురీత.. బతుకునివ్వని చేనేత.. పొట్టనింపని పోగుల పని.. కట్టుకున్న భార్యను పోషించలేని అసహాయత.. మందుగోళీలకు సైతం చిల్లిగవ్వలేని దయనీయం.. పని చేద్దామంటే సహకరించని వయసు.. వేధిస్తున్న మొండి రోగంతో వేగలేక ఓ నేతకార్మికుడు నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. కార్మికక్షేత్రంలో 'చితికి'పోయిన నేతన్న బతుకుచిత్రం గుండెలను పిండేస్తుంది. సిరిసిల్ల శివారులోని రాజీవ్‌నగర్‌లో శనివారం ఇంట్లోనే ఉరివేసుకుని సిరిపురం లక్ష్మీనారాయణ(66) అనే నేతకార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. చేనేతమగ్గంపై పనిచేసిన లక్ష్మీనారాయణ మరమగ్గాల పని సైతం నేర్చుకుని కాటన్‌బట్ట నేశాడు. పెద్దకొడుకు నవీన్‌కు పెళ్లి చేయగా.. టెక్స్‌టైల్ పార్క్‌లో కార్మికుడిగా పనిచేశాడు. అక్కడ పని లేక నెల రోజుల కిందట హోటల్ పెట్టుకున్నాడు. చిన్నకొడుకు వేణు ఎమ్మెస్సీ చదువుకుని ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.

ఇంటి వద్ద ఇద్దరే..

రాజీవ్‌నగర్‌లోని పూరింట్లో దంపతులు ఇద్దరే ఉంటారు. భార్య వజ్రవ్వకు పక్షవాతం. ఒక్క రోజు మందులు లేకున్నా ఆమె మాట పడిపోతుంది. లక్ష్మీనారాయణ కాళ్లు వాపులు వచ్చి, నల్లబడిపోయాయి. వైద్యానికి డబ్బులు లేక, భార్యకు మందులు తేలేక.. మానసిక సంఘర్షణకు లోనై ఉరి వేసుకుని ఉసురు తీసుకున్నాడు. భర్త శవాన్ని చూసిన వజ్రవ్వ గుండెలు బాదుకుంది. తంగళ్లపల్లిలో ఉండే కొడుకు, కోడలు, హైదరాబాద్‌లో ఉండే చిన్న కొడుకు వచ్చి తండ్రి శవాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నారు. 66 ఏళ్ల మలిసంధ్యలో ఉరివేసుకుని ఉసురు తీసుకోవడం కలచివేసింది.

స్పందించిన నేతలు

లక్ష్మీనారాయణ ఆత్మహత్య ఘటన సమాచారం తెలియగానే సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.కె.మహేందర్ రెడ్డి స్థానిక నాయకుల ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానికంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు రూ.50వేల ఆర్థిక సాయం అందించి వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కలెక్టర్ అనురాగ్ జయంతితో ఫోన్‌లో మాట్లాడి నేతన్న కుటుంబాన్ని ఆదుకోవాలని సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక కౌన్సిలర్ బుర్ర లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, బుర్ర మల్లికార్జున్, ఒగ్గు రాజేశం ఉన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ స్పందించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. బీజేపీ నాయకులు రెడ్డబోయిన గోపి, ఆడెపు రవీందర్, నాగుల శ్రీనివాస్, బొల్లం నాగరాజు, కైలాస్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య

సిరిపురం లక్ష్మీనారాయణ(66) కాటన్ కార్మికుడిగా పనిచేసేవాడని, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు సాగర్ తెలిపారు. నేతకార్మికుడి ఆత్మహత్యపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. మృతుడు ప్రగతినగర్‌కు చెందిన ఆసామి శివరాత్రి లింగయ్య వద్ద కాటన్ కేస్‌మెంట్ బట్టను ఉత్పత్తి చేశాడని తెలిపారు. మృతుడి కుడి కాలికి ఇన్‌ఫెక్షన్ అయిందని, అతని భార్య వజ్రవ్వకు పక్షవాతం వచ్చిందని వివరించారు. అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో లక్ష్మీనారాయణ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. రూ.2లక్షల వరకు అప్పులు ఉన్నాయని, సొంతంగా పెంకుటిల్లు ఉందని వివరించారు. వృత్తిపరంగా పని లేక లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు పాల్పడలేదని ఏడీ సాగర్ తెలిపారు.

చులకనగా మాట్లాడుతున్నాడని చంపేశాడు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి, పక్కన సీఐ శ్రీనివాస్, ఎస్సై అంజయ్య

వేములవాడ: నలుగురిలో చులకనగా మాట్లాడిన సిర్రం మహేశ్‌ను దర్ర తిరుపతి సిమెంట్‌రాయితో దాడి చేసి హతమార్చినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. శనివారం హత్య వివరాలు వెల్లడించారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన సిర్రం మహేశ్‌కు 12 ఏళ్ల క్రితం పద్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు. మూడేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలతో విడిపోయారు. ఏడాది క్రితం నుంచి వేములవాడలోని భగవంతరావునగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ బిల్డింగ్ మేస్త్రీల దగ్గర కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో అతడికి భార్యతో గొడవపడి ఒంటరి జీవితం గడుపుతున్న దర్ర తిరుపతి పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి మేస్త్రీల వద్ద పని చేసుకుంటూ ఒకే రూమ్‌లో ఉన్నారు. కాగా నాలుగు నెలల నుంచి తిరుపతి కిరాయి డబ్బులు ఇవ్వడం లేదని, ఫ్రీగా ఉంటున్నాడని తరచూ సూటిపోటి మాటలతో వేధించాడు. అంతేకాకుండా రూమ్ శుభ్రంగా ఉంచడని, తాగుడు ఎక్కువ అవుతుందని, రూమ్‌లోనుంచి గెంటేస్తే ఫుట్‌పాత్‌పై బతకాల్సి వస్తుందని నిత్యం మానసికంగా వేధించసాగాడు. ఇవన్నీ తిరుపతి మనసులో పెట్టుకొని మహేశ్‌ను చంపాలని ప్లాన్ వేశాడు. ఈనెల 1న రాత్రి తిరుపతి రూమ్‌కి వెళ్లి మహేశ్‌కు బాగా మద్యం తాగించి మత్తులోకి జారుకోగానే సిమెంట్ బండరాయితో తలపై బాది హతమార్చాడు. నిందితుడిని చెక్కపల్లిరోడ్డులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో టౌన్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్సై అంజయ్య ఉన్నారు.

వివాహిత అదృశ్యం

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి రేకుర్తి గ్రామానికి చెందిన వివాహిత బిజిలి మనీషా (25) ఈ నెల 4 నుంచి అదృశ్యమైనట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. మనీషాకు రేకుర్తికి చెందిన బిజిలి సదానందంతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 3న భర్తతో గొడవపడి బంధువుల ఇంటికి వెళ్లి ఆ రాత్రి అక్కడే ఉండి మరుసటి రోజు అత్తగారింటికి వెళ్తానని చెప్పి కనిపించకుండా పోయింది. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- డీఆర్‌డీవో శేషాద్రి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల: ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఆర్‌డీవో శేషాద్రి సూచించారు. కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఏపీఎంలు, కేంద్రాల ఇన్‌చార్జీలు, బుక్ కీపర్లు, కమిటీ సభ్యులకు శనివారం శిక్షణ ఇచ్చారు. శేషాద్రి మాట్లాడుతూ ధాన్యం సేకరణలో ప్యాడీక్లీనర్ ద్వారా వడ్లను పట్టించి, ఏఈవో ధ్రువీకరించిన ధాన్యాన్ని మాత్రమే కొనాలని తెలి పారు. కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యం పంపాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా పౌర సరఫరాల డీఎం జితేంద్రప్రసాద్, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం పాపారావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, జిల్లా సమాఖ్య కార్యదర్శి రజిత, సిబ్బంది నాగాచారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ కల్యాణం



ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో శనివారం శ్రీపెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పెద్దపట్నం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం గావు పట్టారు. శుక్రవారం రాత్రి పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకలలో మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు.